సాక్షి అనకాపల్లి
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



లోక్‌అదాలత్ తీర్పే ఫైనల్

జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు పాల్గొని రాజీమార్గంలో కేసులు పరిష్కరించారు. 8లో



వైభవంగా పవిత్రోత్సవాలు

విశాఖ: కప్పరాడలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి.



వరల్డ్ క్లాస్‌గా సింహాచలం స్టేషన్

విశాఖ: సింహాచలం స్టేషన్‌ను రూ.20 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ



మాకవరపాలెం: తామరంలో అధికారులు, బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్

కోటవురట్ల/మాకవరపాలెం: ఓటరు జాబితాను ఎటువంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. ఓటర్ల సవరణకు చివరిగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. కోటవురట్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో, మాకవరపాలెం మండలంలోని తామరంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరాలను ఆయన సందర్శించారు. రెవెన్యూ సిబ్బందితో ఓటరు జాబితాపై సమీక్షించారు. ఎలక్టోరల్ రోల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జనాభా ప్రాతిపదికన స్త్రీ, పురుష నిష్పత్తి సమగ్రంగా ఉండాలన్నారు. ఓటర్ల తొలగింపు, చేర్పుల్లో పొరపాట్లు జరగకుండా జాబితాను తయారు చేయాలన్నారు. పెళ్లి చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని, వలస వెళ్లిన వారిని గుర్తించి పూర్తి సమాచారంతో వారి వివరాలు జాబితాలో నమోదు చేయాలన్నారు. సమగ్రంగా రూపొందిన ఓటరు జాబితాను వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, ఈఆర్‌వో రామలక్ష్మి, తహసీల్దార్లు జానకమ్మ, ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తాండవలో పెరుగుతున్న నీటిమట్టం



తాండవ రిజర్వాయరులో పెరుగుతున్న నీరు

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి 6 అడుగుల నీరు వచ్చి చేరింది. తుపానుకు ముందు ప్రాజెక్టులో 345 అడుగుల నీటిమట్టం ఉండేదని శనివారం సాయంత్రానికి 351.2 అడుగులకు చేరిందని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతం నుంచి రోజుకు 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. మరింత నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా డెడ్‌స్టోరేజీ నీటిమట్టం 340 అడుగులుగా అధికారులు పరిగణిస్తారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతోపాటు ఖరీఫ్ సాగుకు రైతులు కోరిన మేరకు నీటిని విడుదల చేయడంతో నీటిమట్టం గణనీయంగా తగ్గిందని, ఇటీవలి వర్షాలతో పెరిగే అవకాశముందని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారుల ప్రతిభ



జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన సుష్మిత, విష్ణువర్ధన్

యలమంచిలి: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలి పట్టణానికి చెందిన పి.సుస్మిత బాలికల విభాగంలో బంగారు పతకం, ఆర్.విష్ణువర్ధన్ బాలుర విభాగంలో రజత పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు పి.అచ్యుతరెడ్డి, అచ్చంనాయుడు, కొఠారు దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర అభినందించారు.

మా కొద్దీ యువగళం!



లోకేష్ యువగళం పాదయాత్రకు ఆ పార్టీ నేతలే ఆసక్తి చూపడం లేదు. తమ నియోజకవర్గాల్లో వద్దు బాబోయ్ అంటూ వేడుకుంటున్నారు. పాదయాత్రకు జనం నుంచి పెద్దగా స్పందన లేకపోవడాన్ని గ్రహించిన ఆ పార్టీ నేతలు.. జన సమీకరణకు వచ్చే ఇబ్బందులను గ్రహించి తమ వద్ద వద్దంటూ తెగేసి చెబుతున్నారు. ఇక తన కొడుకు సీటు విషయంలో కినుక వహించిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 'మా కొద్దీ యువగళం' అని స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదని తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

- యువగళం పాదయాత్ర తమ నియోజకవర్గాల్లో వద్దంటున్న తమ్ముళ్లు
- నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గంలో యాత్ర రద్దు
- పార్టీ వైఖరిపై అయ్యన్న కినుక, చేతులెత్తేసిన చోడవరం, మాడుగుల నేతలు
- చేసేదేమీ లేక రూట్‌మ్యాప్ మార్పు

టీడీపీ నేత లోకేష్ యువగళం పాదయాత్రపై ఆ పార్టీ నేతలే పెదవిరుస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో పాదయాత్ర అవసరం లేదని, రూట్ మ్యాప్ మార్చాలంటూ వేడుకుంటున్నారు. మొదటగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఉన్న తమ నియోజకవర్గాలను తప్పించి, కొత్త రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని తేల్చిచెబుతున్నారు. పాదయాత్రకు జన సమీకరణ తమ వల్ల కాదని కొందరు అంటుంటే.. పార్టీ అధిష్టానం వైఖరిపై వ్యతిరేకతతో కొందరు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అలకబూనడంతో నర్సీపట్నం నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర రూట్ మ్యాప్ మారినట్టు ఆ పార్టీలోనే చర్చ జరుగుతోంది. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటుపై స్పష్టత ఇవ్వకపోవడంతో యువగళం పాదయాత్రకు ఆసక్తి చూపడం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన నేతలు 'మా కొద్దీ యువగళం' అని తెగేసి చెబుతున్నట్టు సమాచారం. ఫలితంగా ఈ మూడు నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర రద్దు అయినట్టు తెలుస్తోంది. తెలుగు తమ్ముళ్ల నిరాసక్తతో ఉమ్మడి విశాఖ జిల్లాలో యువగళం పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను మార్చివేసినట్టు ఆ పార్టీ నేతలే పేర్కొనడం గమనార్హం.

సొంత నేతల నుంచే నిరాసక్తత!

వాస్తవానికి మొదటగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు పాదయాత్ర ఉమ్మడి విశాఖ జిల్లాలో పాయకరావుపేట నుంచి కోటవురట్ల మీదుగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పరవాడ, గాజువాక చేరుకొని, నగరంలోకి ప్రవేశించి, పెందుర్తి మీదుగా భీమిలి చేరుకోవాలి. తాజాగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 11న పాయకరావుపేటలో ప్రవేశించి యలమంచిలి, అనకాపల్లి, పరవాడ, గాజువాక మీదుగా నగరంలోకి ప్రవేశించనుంది. ఈ నెల 20 లేదా 21వ తేదీన భీమిలిలో ముగించాలని నిర్ణయించారు. ఇందులో నర్సీపట్నం, చోడవరంతో పాటు మాడుగుల నియోజకవర్గాలను తీసివేశారు.

ప్రధానంగా తన కొడుకు ఎంపీ టికెట్‌పై పదే పదే అడుగుతున్నప్పటికీ తేల్చకపోవడంతో పాటు కేవలం ఎన్నికలకు ఏడాది ముందు బయటకు వచ్చిన గంటాకు ప్రాధాన్యత పెరగడాన్ని అయ్యన్నపాత్రుడు తీవ్రంగా తప్పుపడుతున్నట్టు తెలుస్తోంది. అనకాపల్లి ఎంపీ టికెట్ ను తన కొడుకుకు కేటాయించాలని కోరినా పట్టించుకోకపోగా.. ఈ స్థానంలో అభ్యర్థి కోసం గంటా కొంతమందితో మాటా మంతీ సాగించడంపై అయ్యన్న తీవ్రంగా తప్పుపడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు చోడవరంలో పాదయాత్ర నిర్వహణకు ఆ పార్టీ ముఖ్యులు ముందుకు రాకపోగా.. మాడుగుల నియోజకవర్గంలో అసలు నేత ఎవరనే చిక్కు వచ్చింది. అంతేకాకుండా అధికార వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక బస్సు యాత్రకు జనం జేజేలు పలకడంతో ముఠాలతో కుస్తీ పడుతున్న టీడీపీ నేతల వైఖరితో ఈ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహణ కష్టమని పార్టీ పెద్దలు కూడా భావించినట్టు తెలుస్తోంది.

పార్టీ వైఖరిపై కినుక !

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ సీటుతో పాటు నర్సీపట్నం ఎమ్మెల్యే టికెట్ కావాలని అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. అయితే దీనిపై పార్టీ నుంచి సరైన స్పందన లభించలేదు. నర్సీపట్నం టికెట్ ఇస్తాం.. ఎంపీ టికెట్‌పై చూద్దామంటూ దాటవేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి ఎంపీ టికెట్ కోసం మాజీ మంత్రి గంటా అభ్యర్థులను అన్వేషిస్తున్నారు. ఒక ఎన్ఆర్ఐను బరిలోకి నిలిపేందుకు వెదకడంతో పాటు కొద్ది మందిని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అయ్యన్నపాత్రుడు మండిపడుతున్నారు. అంతేకాకుండా నర్సీపట్నం నియోజకవర్గంలో కూడా కొద్ది మంది అసంతృప్తి నేతలను కలిపి పిక్నిక్ తరహాలో వన భోజనాలను గతంలో గంటానే వెనుక ఉండి నిర్వహించేలా చేశారనేది అయ్యన్న అభియోగం. ఈ విషయాన్ని కూడా పార్టీ అధినేత వద్ద ప్రస్తావించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ గంటాను పిలిచి మందలించడం వంటిది చేయకపోవడం అయ్యన్నకు మరింత ఆగ్రహాన్ని తెప్పించిందనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికలకు ఏడాది ముందు మాత్రమే గంటా బయటకు రావడాన్ని అయ్యన్నపాత్రుడు బహిరంగంగానే విమర్శించారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నేతలను దూరం ఉంచాలని.. వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని కూడా అయ్యన్న నేరుగా చంద్రబాబుకే స్పష్టం చేశారు. అయినప్పటికీ వైఖరి మారకపోవడంతో అలకబూనినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర నిర్వహణకు పెద్దగా ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో యువగళం పాదయాత్ర అంటేనే ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

జిల్లాలో నేటి నుంచి పంట నష్టం గుర్తింపు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



నీటిలో కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను ఆదివారం నుంచి అధికారులు గుర్తిస్తారని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శనివారం భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో వడ్డాదిలో నీటి ముంపునకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు, వంతెనలను ఆయన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల జిల్లాలో పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్నారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తి నీరు విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం అందిస్తామన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

వడ్డాది వంతెనకు మరమ్మతులు చేసి రవాణా సదుపాయం పునరుద్ధరిస్తాం

తుపాను వల్ల దెబ్బతిన్న వడ్డాది వంతెనకు మరమ్మతు పనులు చేపట్టి రవాణా సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలకు ప్రధాన ముఖద్వారం కావడంతో రవాణాకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేగంగా పనులు పూర్తి చేయించాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దెబ్బతిన్న వంతెన మరమ్మతు పనులు చేపట్టి ముందుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలకు రవాణా సదుపాయం కల్పించాలని డీఈఈ రమేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. పూర్తి స్థాయిలో వంతెన పనులు పూర్తి చేసిన వెంటనే బస్సులు ఇతర వాహనాలను అనుమతించాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఈ నాగమోహన్‌రావు తదితర్లు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కిట్లు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం బూడి 8లో

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు

- టీడీపీ, జనసేన పార్టీలను వీడిన 90 మంది నేతలు
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సమక్షంలో చేరిక
- చౌడువాడ గ్రామంలో ప్రతిపక్షాలకు గట్టి షాక్

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో టీడీపీ, జనసేనకు చెందిన 90 మంది ఆ పార్టీలకు గుడ్‌బై చెప్పి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ ఆధ్వర్యంలో చౌడువాడ, మల్లంపాలెం గ్రామాలకు చెందిన వీరు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి చెందిన సుందరపు మహేష్, పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోమార ఎర్రునాయుడు, కోమార రవి, మారపురెడ్డి నాగేశ్వరరావుతోపాటు జనసేన పార్టీకి చెందిన కోమార ప్రసాద్, సేనాపతి అప్పారావు, పడాల శ్రీను, లక్ష్మణరావు తదితరులతో 60 కుటుంబాలకు చెందిన 90 మందికి వైఎస్సార్‌సీపీ కండువాలను వేసి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకు పాటుపడే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని ముత్యాలనాయుడు అన్నారు.



టీడీపీ, జనసేన నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ.. రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్ పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కృషి చేసి వైఎస్సార్‌సీపీ విజయంలో భాగస్వాములం కానున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, చిన్ని చిరంజీవి పాల్గొన్నారు.

మొండిగెడ్డ మెడలు వంచి..

- పూడిక తొలగింపుతో తీరిన ముంపు సమస్య
- రూ.45 లక్షలతో 9 కి.మీ. మేర గతేడాది పనులు
- డిప్యూటీ సీఎం బూడి చొరవతో రైతులకు తీరిన కష్టం
- నాడు వర్షం కురిస్తే భయం.. నేడు మిచాంగ్‌లోనూ ధీమా

అభివృద్ధి పరిధి చాలా విస్తృతం. కొన్నిసార్లు రూ.కోట్లలో నిధులు వెచ్చించనక్కర్లేదు. రూ.లక్షల్లో చేపట్టే పనులే స్థానిక ప్రజల బతుకుల్లో చాలా మార్పులు తీసుకొస్తాయి. అందుకు వారాడ వద్ద మొండిగెడ్డ పూడిక తొలగింపే నిదర్శనం. దాదాపు 50 ఏళ్లుగా పేరుకుపోయిన పూడికతో.. ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు, పొలాలు ఏకమయ్యేవి. పూడిక తొలగించాక ఐదు గ్రామాల ప్రజలు, సుమారు 500 ఎకరాల పంట పొలాలకు ముంపు ముప్పు తొలగింది. వానా కాలంలో ప్రజలకు ప్రశాంతత దొరికింది.



పూడికతీతకు ముందు మొండిగెడ్డలో పరిస్థితి



పూడికతీత తరువాత మొండిగెడ్డ మార్గం సుగమం

కె.కోటపాడు: గతంలో వర్షం పడిందంటే చాలు రైతుల గుండెల్లో గుబులు రేగేది. మొండిగెడ్డ పరీవాహక ప్రాంత పంట పొలాలు నీట మునిగేవి. వారాడ నుంచి గొండుపాలెం వరకు మొండిగెడ్డ మార్గంలో గత ఏడాది పూడికతీత పనులు చేపట్టడంతో ఇప్పుడు ఆ బాధ తప్పింది. మిచాంగ్ తుపాను సమయంలో నాలుగు రోజులపాటు విపరీతంగా వానలు కురిసినా రైతులు, ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి ఇబ్బంది ఎదుర్కోలేదు. మొండిగెడ్డను ఆనుకుని ఉన్న వారాడ, పాడుగుపాలెం, సూర్రెడ్డిపాలెం, మేడిచర్ల, గొండుపాలెం గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు ముంపు ముప్పును తప్పించుకున్నాయి. దీంతో ఈ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

50 ఏళ్లుగా పేరుకుపోయిన పూడిక

వారాడలోని ఏడు ఖానాల మదుం నుంచి గొండుపాలెం వరకు మొండిగెడ్డ మార్గంలో పూడిక తొలగింపు పనులు 50 ఏళ్లుగా చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో గెడ్డలో పిచ్చి మొక్కలతోపాటు, పూడిక విపరీతంగా పేరుకుపోయింది. వారాడ-ఎం.అలమండ గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. భారీ వర్షాలు, తుపాన్ల సమయంలో మొండిగెడ్డ నీరు సమీప పొలాలు, రోడ్డు మీదుగా ప్రవహించేది. దీంతో ఆరుగాలం శ్రమించిన రైతులకు ముంపునీటితో నష్టం వాటిల్లేది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. పూడిక తొలగింపుతో ఈ ఇక్కట్లు తొలగినట్లయింది.

డిప్యూటీ సీఎం బూడి సహకారం

మొండి గెడ్డలో పూడికతీత పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.45 లక్షల నిధులను గతేడాది మంజూరు చేయించారు. రైతులు మొండిగెడ్డ మార్గంలో ముంపునీటి సమస్యతో పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన 9 కి.మీ. మేర పూడిక తొలగింపు పనులు జరిపించారు. ప్రస్తుత మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో ముంపు సమస్య తలెత్తినా, మొండిగెడ్డ పరీవాహక ప్రాంత పంట పొలాలు మాత్రం పెద్దగా ముంపు బారిన పడలేదని రైతులు చెప్తున్నారు.

ముంపు సమస్య తీరింది



నాకు వారాడలో మొండిగెడ్డను ఆనుకుని రెండెకరాల పొలం ఉంది. భారీ వర్షాల సమయంలో గెడ్డ నీటితో పొలం ముంపునకు గురై పంట నష్టం కలిగేది. మొండిగెడ్డ మార్గంలో పూడిక, పిచ్చిమొక్కలను తొలగించడంతో నీటి ప్రవాహానికి ఆటంకాల్లేవు. దీంతో గెడ్డ మార్గం పరిసర పొలాలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పోయాయి.

–బి.దొరస్వామినాయుడు, రైతు, వారాడ

అడక్కుండానే నిధులు



వారాడ ఏడు ఖానాల మదుం ప్రాంతంలో భారీ వర్షాలకు మొండిగెడ్డ నీరు రోడ్డుపైనే ప్రవహించేది. ఈ రోడ్డు మీద వెళ్లేందుకు కూడా వీలయ్యేది కాదు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మా దుస్థితి తెలుసుకుని, అడక్కుండానే పూడిక తొలగింపునకు నిధులు మంజూరు చేశారు. ఇంత తుపాను సమయంలో కూడా ముంపు సమస్య తలెత్తలేదు. పూడిక తొలగించడంతో 500 ఎకరాలకు మేలు జరిగింది. నాయకులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఆలోచిస్తే ఇలా మేలు జరుగుతుంది.

–గొర్రుపోటు సౌజన్య, సర్పంచ్, వారాడ

లోక్‌అదాలత్ తీర్పే ఫైనల్

- 9వ అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

చోడవరం రూరల్: లోక్‌అదాలత్‌లో చేసుకున్న పరిష్కారానికి తిరుగులేదని, దానిపై మరో కోర్టుకు వెళ్లడానికి సైతం అవకాశం లేదని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో మండల న్యాయపరిషత్ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ అధ్యక్షతన మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 335 కేసులు పరిష్కృతమయ్యాయి. వీటిలో 16 సివిల్ దావాలు కాగా 319 కేసులు సాధారణ క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏళ్ల తరబడి కోర్టులలో అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో ఇరు వర్గాలు రాజీ పడి పరిష్కరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కల్పించిన చక్కని అవకాశం లోక్‌అదాలత్ విధానమని తెలిపారు. సబ్‌జడ్జి సత్తి అరుణశ్రీ మాట్లాడుతూ ఇరువర్గాల సమ్మతితో లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా చిక్కులు, సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. రాజీ పడడంలో ఏ వర్గంవారు పంతాలు, పట్టింపులకు పోరాదని హితవు పలికారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, న్యాయవాది ఆర్.ఎస్.పి.నాయుడు లోక్‌అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు కలుగుతున్న మేలును వివరించారు.



చోడవరం న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

రాజీమార్గమే ఉత్తమం

అనకాపల్లి టౌన్: రాజీమార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని 10వ అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య అన్నారు. ఆమె న్యాయమూర్తులు గంగరాజు, ప్రదీప, విజయలక్ష్మి,శివకిరణ్‌లతో కలిసి స్థానిక న్యాయస్థానంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనవసరమైన గొడవలు పెంచుకొని బంధుత్వాలు పోగొట్టుకోవద్దన్నారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. లోక్‌అదాలత్‌లో 189 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్, కార్యదర్శి సూరా శ్రీనివాస్, బార్ అసోసియేషన్ సభ్యులు సాయిరాం, రామచంద్రరావు, కిశోర్, లీలా, సరేష్ పాల్గొన్నారు.

క్రీడలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం


స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కిట్లు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా క్రీడలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి సచివాలయం–2లో 'ఆడుదాం ఆంధ్రా' కిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాలకు సంబంధించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు వీటిని అందజేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరానికి సంబంధించి స్పోర్ట్స్ కిట్లు మండల కేంద్రానికి మూడు, సచివాలయానికి ఒకటి చొప్పున ఇచ్చారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలం నాయుడు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ములకలాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆర్.వి.కె. నాయుడు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- విద్యార్థిని కోసం జరిగిన గొడవలో ఇరికించారని మనస్తాపం

మాడుగుల: విద్యార్థిని కోసం జరిగిన గొడవ కేసులో తనను అక్రమంగా ఇరికించారన్న మనస్తాపంతో మాడుగుల గ్రామానికి చెందిన యు.గుణసాయి (25) అనే యువకుడు శనివారం ఉదయం చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనకాపల్లి దిశ డీఎస్పీ ఎం.మహేష్ విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 5వ తేదీన రాజవీధికి చెందిన విద్యార్థిని విషయంలో కొంతమంది యువకులు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన బొబ్బాది శ్రీనును గాయపరిచారు. దీంతో శ్రీను ఇదే గ్రామానికి చెందిన గుణసాయి కూడా తనను గాయపరిచిన వారిలో ఉన్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థానిక ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారన్నారు. దర్యాప్తులో భాగంగా గుణసాయిని పోలీసులు విచారించారు. గొడవ జరుగుతున్న సమయంలో అటుగా వెళ్తున్న తాను సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తే పోలీసులు స్టేషన్‌కు పిలిపించారన్న మనస్తాపంతో గుణసాయి శనివారం చీమల మందు తాగాడు. చికిత్స అనంతరం గుణసాయి ఆరోగ్యం కుదుటపడిందని, మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్‌ఆస్పత్రికి తరలించినట్టు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఎస్.తాతారావు, ఎస్‌ఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దిశ డీఎస్పీ మహేష్, సీఐ తాతారావు, ఎస్‌ఐ దామోదర నాయుడు

సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయండి

- వడ్డాదిలో సభా వేదికను పరిశీలించిన విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలోని వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 12న చేపట్టే భారీ బహిరంగ సభ వేదిక స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ నెల 5న నిర్వహించాల్సిన బస్సు యాత్రను తుపాన్ కారణంగా వాయిదా వేశారు. ఇక్కడకు పలు గ్రామాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయా లని విప్ ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు సూచించారు. కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, రాష్ట్ర కిసాన్ సంఘం కన్వీనర్ కే అచ్చింనాయుడు, పార్టీ కన్వీనర్ జోగా కొండబాబు, సర్పంచ్‌లు కోరుకొండ కామ లక్ష్మి సూరి అప్పారావు, తమరాన శ్రీను, వేపాడ మధు ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ పాల్గొన్నారు.


సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

రోలుగుంట: స్థానిక ఎంపీపీ చాంబర్‌లో పార్టీ ముఖ్య నాయకులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దిశానిర్దేశం చేశారు. రోలుగుంట మండలం కొండపాలెం శివారు వెలంకాయపాలెంలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, సీనియర్ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, ఉలబాల రాము పాల్గొన్నారు.

దీపపు బుడ్డి మంటలు ఎగిసిపడి వృద్ధురాలి మృతి

మునగపాక: మండలంలోని తోటాడలో దీపపు బుడ్డి మంటలు ఎగిసిపడి అంగులూరి రమణమ్మ(85) మృతి చెందింది. ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు విశాఖలో పెయింటింగ్ పనులు చేసుకుని ఇంటికి వస్తుంటాడు. వీరు చిన్న గుడిసెలో ఉంటున్నారు. ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి రమణమ్మ తన ఇంట్లో దీపపు బుడ్డి వెలిగించే క్రమంలో పక్కనే టర్పంటైన్ ఆయిల్‌పై నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆమె కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మునగపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి వృద్ధుడు..

నక్కపల్లి: మండలంలోని నల్లమట్టిపాలెంలో తుపాను వర్షాలకు తడిసి నానిపోయిన ఇంటి గోడ కూలి మాసా సింహాచలం(62) మరణించాడు. ఎస్‌ఐ విభీషణ్‌రావు వివరాల ప్రకారం.. సింహాచలం తన పశువులను మేపుకునేందుకు పాడుబడిన ఇంటి గోడ పక్క నుంచి తోలుకెళ్తుండగా అతనిపై కూలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు నక్కపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


సింహాచలం(ఫైల్)

ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

కోటవురట్ల: మండలంలోని చింతలపాలెం వద్ద గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని సీఐ ఎ. రవికుమార్ శనివారం తెలిపారు. చింతలపాలెం వద్ద అదనపు ఎస్‌ఐ జె. నాగేశ్వరరావు, సిబ్బందితో కలిసి వారి బ్యాగులను తనిఖీ చేయగా 12 కిలోల గంజాయి, రెండు కిలోల హషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులది కేరళ రాష్ట్రం కన్నూరు జిల్లాకు చెందిన మహేందస్(33), ఎ. నందకృష్ణ(46), కె. అష్రఫ్(49)గా గుర్తించామన్నారు. వారిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూ వివాదంతో రైతు ఆత్మహత్య

నక్కపల్లి: భూ వివాదం నేపథ్యంలో మండలంలో గునిపూడి గ్రామానికి చెందిన రైతు వానపల్లి నాగేశ్వరరావు(66) ఆత్మహత్యకు చేసుకున్నాడు. కొద్ది నెలల క్రితం తన అరెకరం భూమి గ్రామానికి చెందిన లోవరాజుకు విక్రయించి రూ.5 లక్షలు బయానాగా తీసుకున్నాడు. ఇంతలో భూ వివాదంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. ఈ పరిస్థితిలో బయానా తిరిగి ఇవ్వాలని కొనుగోలుదారుడు ప్రంచాయితీ పెట్టాడు. ఈ నేపథ్యంలో తీవ్ర ఆందోళనకు గురైన నాగేశ్వరరావు శుక్రవారం క్రిమిసంహారక మందు సేవించాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో శనివారం విశాఖ తరలించేందుకు అంబులెన్స్ ఎక్కిస్తుండగా మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నక్కపల్లి ఎస్‌ఐ విభీషణ్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం



గౌరీపరమేశ్వరుల సన్నిధిలో ఎంపీ సత్యవతి దంపతులు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో గవరపాలెం పీలా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీ వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో 10 వేల మందికి భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారిని ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర, సంఘ సేవకుడు కాండ్రేగుల శ్రీరాం దంపతులు, బుద్ద రమణి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మారిశెట్టి జగన్నాథరావు, కమిటీ సభ్యులు దాడి రామకృష్ణ, బుద్ద శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ, బుద్ద శివ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

అనకాపల్లిటౌన్ : ఉద్యోగులకు న్యాయం చేస్తూ నెలనెలా జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జిల్లా యూపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి శనివారం ఓ ప్రకటనలో కోరారు. 9వ తేదీ గడుస్తున్నా ఈనెల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం ఆవేదనగా ఉందన్నారు.

కాంగ్రెస్ ఎంపీకి వ్యతిరేకంగా బీజేపీ నేతల నిరసన

అనకాపల్లిటౌన్ : కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ అవకాశవాద రాజకీయాలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ఎంపీ నీరజ్‌సాహు అవినీతిపై శనివారం సాయంత్రం నిరసన తెలియజేశారు. ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చదరం నాగేశ్వరరావు, కర్రి రామకృష్ణ, బొడ్డేడ నాగేశ్వరరావు, వనం సత్యనారాయణ, పాలమరశెట్టి నాగేశ్వరరావు, వుడా రమేష్, వి.నర్సింగ్ యాదవ్, కపిరి తాతారావు, షేక్ బ్యుహాన్, ఆడారి కోటేశ్వరావు, వి.మంగ, ఒ.నాగమణి, కొణతాల కృష్ణ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 246 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,920	4,610
రెండో రకం	3,810	4,110
మూడోరకం	3,800	3,750

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
హాయ్ నాననన్న	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
కోటబొమ్మాళి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-8 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 476 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 393 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కాలువలకు.. కొత్తరూపు



పట్టణ ప్రణాళికలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కీలకాంశం. అది సరిగా లేకపోతే ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడతారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ విషయంలో సరైన ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టడంతో అనకాపల్లి పట్టణం సుందరంగా రూపుదిద్దుకుంది. ఎక్కడా మురుగునీటి సమస్య లేదు. ఎంత పెద్ద వర్షం వచ్చినా రహదారులపై మురుగు నీరు కనిపించదు. దీంతో వాహన చోదకులు, పాదచారులు సులువుగా రాకపోకలు సాగించగలుగుతున్నారు.

తొలగిన మురుగు సమస్య

అందంగా కనిపిస్తున్న రహదారులు

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



విజయరామరాజుపేటలో డ్రైనేజీ

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణ కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయడంతో పట్టణ పరిధిలో జనాభా సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జనాభాకు తగ్గట్టుగా ప్రభుత్వం రహదారుల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడమే కాకుండా రహదారులపై వర్షపునీరు, ప్రజలు వాడిన మురుగు నీరు రహదారులపై ప్రవహించకుండా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. పట్టణ జనాభా లెక్కల ప్రకారం సుమారు 2 లక్షల 20 వేలు. గత ప్రభుత్వాల్లో పట్టణ పరిధిలో వర్షాలు పడే సమయంలో ప్రజలు రహదారులపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. రహదారులపై వర్షపునీరు ప్రవహించడం వల్ల వాహన చోదకులు, పాదచారులు ఎక్కడ నీరు, ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ఆందోళన పడేవారు. నేడు రహదారులకు ఇరువైపులా కాలువలు నిర్మించడంతో వర్షపునీరు కాలువల్లో ప్రవహిస్తూ రహదారులు చక్కగా ఉన్నాయి.

డ్రైనేజీ వ్యవస్థకు వెచ్చించిన నిధులు
జీవీఎంసీ పరిధిలో రూ.7 కోట్ల నిధులతో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం
కోట్నీవీధి, కొత్తూరులో వీధి కాలువల నిర్మాణానికి రూ. 40 లక్షల నిధుల విడుదల



నా పేరు దొంక సత్తిబాబు. మాది పట్టణంలోని ఆమంచివారివీధి. గతంలో కాలువలు రహదారులపై ప్రవహించేవి. వర్షాలు పడితే కాలువల్లో నీరు, రహదారిపై నీరు గృహాల్లోకి ప్రవహించేది. నేడు ఎక్కడికక్కడ కాలువలు నిర్మించడంతో ప్రజల సమస్య తీరింది. మూడు రోజుల క్రితం తుపాను వచ్చినా పట్టణంలో ఎక్కడా చుక్క నీరు రోడ్లపై కనిపించలేదు.

డ్రైనేజీలు నిర్మించిన ప్రాంతాలు
శారదా కాలనీ 5 వీధులు
జీవీ కోటేశ్వరరావువీధి
నర్సింగరావుపేట, టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ వీధి
నెహ్రూ చౌక్, గుండాల జంక్షన్, మిరియాల కాలనీ
పెరుగుబజార్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు
గాంధీనగరం, ఉడ్‌పేట, వేల్పులవీధి, బర్మాకాలనీ
ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, కస్పావీధి
పూడిమడక జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మార్గంలో

జీవీఎంసీ పరిధిలో రూ.7 కోట్ల నిధులతో డ్రైనేజీ వ్యవస్థ నిర్మించి మురుగు, వర్షపునీరు కాలువల్లో ప్రవహించే విధంగా ఏర్పాటు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో జీవీఎంసీ పరిధిలో 80 నుంచి 84 వార్డుల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించడంతో కాలువల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరిగాయి. కోట్నీవీధి, జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరులో కొత్తగా వీధి కాలువలు నిర్మించేందుకు రూ. 40 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. టెండర్ పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.



టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ రహదారిలో సాయిబాబా గుడి వెనుక డ్రైనేజీ

శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది..



పట్టణంలో రహదారులు అభివృద్ధి చేస్తూ, ప్రధానమైన డ్రైనేజీ వ్యవస్థను కొత్తగా నిర్మించడంతో కాలువల ద్వారా మురుగునీరు, వర్షపునీరు పారుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నెహ్రూచౌక్ నుంచి గుండా జంక్షన్ వరకూ ఇరుపైపులా నూతన కాలువలు నిర్మించడంతో మురుగు పెద్ద కాలువల్లోకి చేరుకుంటోంది.

– పిన్నింటి కృష్ణయాదవ్, కోట్నీవీధి, అనకాపల్లి

సమస్య పరిష్కారమయింది..



కాంగ్రెస్, టీడీపీ పాలనలో జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా న్యూకాలనీకి రావాలంటే పడవలో ప్రయాణించాల్సి వచ్చేది. వర్షం పడిందంటే మోకాలు లోతు నీటిలో నీరు నిల్వ ఉండడంతో ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. నేడు జాతీయ రహదారి నుంచి పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో పెట్రోల్ బంకు సమీపంలోని రహదారిని ఎత్తు చేశారు. నూతన కాలువలు ఏర్పాటు చేసి, ఈ కాలువల ద్వారా జాతీయ రహదారి కాలువకు కలపడంతో పెద్ద సమస్య పరిష్కారం జరిగింది.

– ఎం.రమణ, న్యూకాలనీ, అనకాపల్లి

కరువు మండలంగా ప్రకటించాలని సర్వసభ్య తీర్మానం

కశింకోట : కరవు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం తీర్మానించింది. కశింకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ మిచాంగ్ తుపానుకు పండిన వరి నీటి ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిదృష్ట్యా కరవు మండలంగా ప్రకటించాలని చేసిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. పంట నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, అధికారులు పంట నష్టపోయిన రైతుల పేర్లు పూర్తిగా నమోదు చేయాలన్నారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేసేటపుడు వ్యవసాయ అధికారులు, సిబ్బంది స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను తప్పనిసరిగా సంప్రదించాలన్నారు. తేగాడ ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు మాట్లాడుతూ పంట నష్టం అంచనా వేసినప్పుడు



శ్రీనివాసరావు, జయ దంపతులకు సత్కారం

ప్రజా ప్రతినిధులను అధికారులు సంప్రదించడం లేదని వాపోయారు. తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో సమగ్ర భూసర్వే 25 గ్రామ పంచాయతీల్లో పూర్తి అయిందని, బయ్యవరం, తీడ పంచాయతీలు పెద్దవి కావడం, సర్వే సిబ్బందిని ఇతర మండలాలకు డిప్యుటేషన్ వేయడం వల్ల సర్వే ఆలస్యం అవుతుందన్నారు. వైఎస్సార్ జగనన్న లే-అవుట్లలో ప్లాట్లు లేవని, కొత్త వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు సవ్యంగా లేనందున ప్రైవేటు భూములు కొనుగోసి అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, బయ్యవరం సర్పంచ్ గొల్లవిల్లి జయ దంపతులను మండల పరిషత్ పాలకవర్గం తరపున ఘనంగా సత్కరించారు. అలాగే విశేష సేవలందిస్తున్న ఎంపీడీవో వి. రవి కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతిలను వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యురాలు యల్లపు వరలక్ష్మి సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు

వైఎస్సార్ బీమా సాయం అందజేత

అనకాపల్లిటౌన్ : పట్టణంలో చినరామస్వామి ఆలయం దగ్గర నివసిస్తున్న పిళ్లా నాయుడు మృతి చెందడంతో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ.90 వేలు వారి ఖాతాలో జమ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలిమేర ఆదిబాబు, కర్రి కృష్ణ, కర్రి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న భాస్కరరావు

గర్భిణులకు రొట్టెల పంపిణీ

కశింకోట : కశింకోటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పార్టీ అధినేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, రోగులకు శీతల పానీయాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేషన్ సభ్యుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సూరిశెట్టి ఆదిబాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తగరంపూడి గణపతి, బీసీ సెల్ నాయకుడు వాయిబోయిన రాజు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు వస్త్రాల పంపిణీ

తుమ్మపాల : అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి 19 సంవత్సరాల పాటు సుదీర్ఘ కాలం అధ్యక్షురాలిగా పని చేసిన ఘనత సోనియా గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కాళ్ళ వెంకట సత్యనారాయణ అన్నారు. సోనియా జన్మదినం సందర్భంగా పట్టణంలో రిక్షా కార్మికులు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనకా పల్లి పార్లమెంట్ పరిశోధన సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి ఈశ్వరరావు, టి. సుబ్బిరామిరెడ్డి, సేవా పీఠం మాజీ సభ్యులు కె.వి. మాణిక్యం, మహిళలు పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో డిప్యూటీ మేయర్

తుమ్మపాల : పట్టణంలో శ్రీనూకాంబిక అమ్మవారిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కుటుంబ సభ్యులతో వచ్చి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ఆయనకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన్ను సత్కరించి అమ్మవారి ఫొటో బహూకరించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.1 లక్ష విరాళం అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, కొండూరి రవీంద్ర, మళ్లవరపు ఈశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ సతీష్‌ను సత్కరిస్తున్న ధర్మకర్తలు

దివ్యాంగులకు భోజనం ప్యాకెట్ల అందజేత



దివ్యాంగులకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న కుమారస్వామి

అనకాపల్లిటౌన్ : స్థానిక వివేకానందనగర్‌లో శనివారం దివ్యాంగుల దినోత్సవం జరిగింది. పర్యావరణ పరిరక్షణ అవార్డు గ్రహీత ఆడారి కుమారస్వామి తన సొంత నిధులతో 15 మంది దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో బ్రైట్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కాళ్ల శివశంకర్, సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ, దివ్యాంగులు పాల్గొన్నారు.

వైభవంగా శూలాల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో గౌరీపరమేశ్వరులు



పార్వతీపరమేశ్వరుల వేషధారణ

అనకాపల్లిటౌన్ : స్థానిక లక్ష్మీదేవిపేట గౌరీపరమేశ్వరుల శూలాల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 1500 మంది ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం తీర్థం జరిగింది. శివభక్తులు బుగ్గశూలాలతో చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. పార్వతీదేవి, ఈశ్వరుడు, వినాయకుడు, కుమారస్వామి వేషధారణలు, రాజుపాలెం వారిచే బాణసంచా విన్యాసాలు ఉత్సవంలో ఆకర్షణగా నిలిచాయి.

శూలాలు ధరించిన శివభక్తుడు →



పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వద్దు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సీతారామలక్ష్మి

మాకవరపాలెం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయొద్దని వైద్యాధికారి సీతారామలక్ష్మి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం పీఎంఎస్‌ఎంఏవైలో భాగంగా గర్భిణులను ఆమె పరీక్షించారు.

బీపీ, సుగర్, రక్తహీనతకు సంబంధించి మొత్తం 50 మందిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం తల్లీబిడ్డ ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.



కె.జె.పురం పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాదు

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీలో శనివారం గర్భిణులను వైద్యాధికారి లీలాప్రసాదు పరీక్షించారు. వారి ఆరోగ్య జాగ్రతలు, వ్యక్తిగత శుభ్రత గురించి ఈ సందర్భంగా సీహెచ్‌సీ సిహెచ్. పుష్పమ్మ వివరించారు. పీహెచ్ఎన్ ఇందిర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గంగాదేవిపేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. మూలపేట పంచాయతీ గంగాదేవిపేటలో శనివారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

శివుడికి ప్రతీక శూలాల మహోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక చినరాజుపేట చౌడేశ్వరి సాంబమూర్తి శూలాల మహోత్సవాన్ని ప్రతి ఏటా కార్తీకమాసం నాల్గో సోమవారం నిర్వహించడం ఆనవాయి తీగా వస్తోందని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఉత్సవ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. శివుడికి ప్రతీకగా నిర్వహించే శూలాల మహోత్సవం కనుల పండువగా జరుగుతుందన్నారు. ఉత్సవ సలహా కార్యదర్శి బల్లా నాగభూషణం, వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

ఏలేరు కాలువకు గండి

నాతవరం: గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు ఏలేరు కాలువకు గండి కొట్టిన ప్రాంతాన్ని మరమ్మతులు చేస్తున్నామని విస్కో జేఈ నానాజీ తెలిపారు. ఇటీవల తుపాను వర్షాలకు ముంపు వాటిల్లుతుందన్న భయంతో ఏలేరు కాలువ 61వ కిలోమీటరు వద్ద గండి కొట్టేశారు. ఈ మేరకు మండలంలోని ఎం.బి.పట్నం శివారు ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువకు ఏర్పాటు చేసిన లాకులు వద్దకు కొట్టుకొచ్చిన చెత్తను వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి వెంకటరమణ, గ్రామస్తులు ఆయనకు చూపించారు. ఈ మేరకు వెంటనే మరమ్మతుల చర్యలు చేపట్టారు. వాస్తవంగా ఏలేరు కాలువ నీటి వల్ల ముంపు ఏర్పడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇది తెలియక కాలువకు గండి కొట్టేశారు. దాంతో స్వల్పంగా కాలువ కాలువ కోతకు గురైంది. ఈ మేరకు పొక్లెయిన్‌తో పూడ్చివేత చర్యలు చేపట్టారు.



ఏలేరు కాలువ గండిని కప్పుతున్న పొక్లెయిన్

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం

రావికమతం: తప్పులు లేని ఓటరు జాబితా మనందరి లక్ష్యమని, ఇంటింటికి తిరిగి విచారణ చేసి అనర్హత ఓట్లు తొలగించాలని నియోజక వర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి రవికిరణ్‌తోపాటు అధికారులు, ఫీల్డ్ సిబ్బందితో శనివారం ఆమె సమీక్షించారు. మండలంలో కొత్తగా ఓటు నమోదుకు, తొలగింపు, మైగ్రేటెడ్‌కు సంబంధించి 3,400కు పైగా దరఖాస్తులు వచాయన్నారు. బీఎల్వోలతోపాటు ఫీల్డ్ అధికారులు ఇంటింటికి తిరిగి మృతి చెందిన వారి పేర్లను, వలస వెళ్లిన వారి పేర్లను కచ్చితంగా తొలగించాలన్నారు. అర్హులెవ్వరూ ఓటు రాలేదనే ప్రశ్న రాకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చలో నెల్లూరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కోటవురట్లలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హిందూ, ముస్లిం పెద్దలు

కోటవురట్ల: నెల్లూరులో ఈ నెల 19న జరగనున్న జయహో 2వ జాతీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడాల రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మహాత్ముని విగ్రహం వద్ద చలో నెల్లూరు గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ముందుగా మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, జయహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేసేందుకు ప్రతి ఒక్కరూ చేయికలపాలన్నారు. మతోన్మాదాన్ని నిర్మూలించి నవసమాజ స్థాపనకు జాతీయ స్థాయిలో జరుగుతున్న మహోద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జయహో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకటరావు, బీసీ నాయకుడు యల్లపు కుమారరాజా, ముస్లిం ప్రతినిధి షేక్ ఖాసిమ్, కో-ఆప్షన్ మెంబర్ ఖుదాబాషా, దళిత నాయకుడు నడింపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.